సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



సీఎంకు కృతజ్ఞతలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గురువారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. పంట రుణాలు మాఫీ చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసినవారిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఉన్నారు. - వేల్పూర్

గరిష్ఠం/కనిష్ఠం
30.9 /24.9

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

6 నుంచి జిల్లా స్థాయి యోగాసన పోటీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామచందర్ వెల్లడించారు. గురువారం నిర్వహించిన ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గంగాస్థాన్ ఫేస్–2లో ఉన్న రామకృష్ణ సేవ సమితిలో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, నిజామాబాద్ రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 9398504054, 9848420803 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ బాధ్యులు బంగారు వీరబ్రహ్మం, ఎన్‌డీవైఎస్‌పీ జనరల్ సెక్రటరీ బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి



ధర్పల్లి: తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. ధర్పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లల్లో కనీస సామర్థ్యాలతో పాటు అభ్యాసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక లిటిల్ హార్ట్స్ హై స్కూల్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. టీచర్ల వివరాలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎండల శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణ పాల్గొన్నారు.

అదనపు డీసీపీగా బాధ్యతలు స్వీకరణ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు లో అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా ఎస్ జ య్‌రామ్ గురువారం బాధ్యతలు స్వీకరించా రు. ఆయనను ఎస్బీ సీఐ శ్రీశైలం నగర సీఐన రహరి,డీసీఆర్‌బీ సీఐ సురేందర్ రెడ్డి తోపాటు పలువురు సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఉన్నత శిఖరాలకు..



నిజామాబాద్ సిటీ: సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు అన్నారు. గురువారం నిజామాబాద్ దుబ్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధించటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జిల్లా వైద్యులు, వైద్య సిబ్బంది కృషి ఫలితంగా టీబీ నివారణలో జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, దీనికి కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నగర మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు కడుపులో నులిపురుగులను చంపేస్తుందని విద్యార్థులు ప్రతిఒక్కరూ ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో సత్ఫలితాలు ఇస్తాయని, ప్రతి ఒక్క విద్యార్థి తప్పకుండా మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత, ఎన్‌డీవీ ఆర్గనైజర్ వెంకటేష్, పాఠశాల హెచ్ఎం గంగాధర్ పాల్గొన్నారు.

ఖద్దరు నేతల పోలీసాట!

బోధన్ ఏసీపీల బదిలీ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఏసీపీ కిరణ్‌కుమార్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి విజయ సారథి వచ్చారు. పదిరోజుల్లోనే తిరిగి యథాస్థానంలోకి కిరణ్‌కుమార్ వచ్చారు. దీని వెనుక అధికారపార్టీలోని ఇద్దరు నేతల ఆధిపత్య పోరే కారణమంటున్నారు.



కిరణ్‌కుమార్ | విజయసారథి

ఖలీల్‌వాడి : బోధన్ ఏసీపీ కుర్చీ ఇద్దరు అధికార పార్టీ నేతల మధ్య ఆటగా మారింది. ఇటీవల జరిగిన ఏసీపీల బదిలీ వ్యవహారాన్ని గమనిస్తే అంతే కనిపిస్తోంది. ఇక్కడి నుంచి బదిలీ అయిన కిరణ్‌కుమార్ పది రోజుల్లోనే తిరిగి యథాస్థానంలోకి వచ్చారు. బోధన్ నియోజకవర్గంలో అధికార పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇద్దరు నేతల మధ్య ఆధిపత్యపోరు గత కొంత కాలంగా సాగుతోంది. ఈ క్రమంలో రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా ఓ ప్రజాప్రతినిధి భర్త అయిన స్థానిక నేతకు సంబంధించిన వారు హైదరాబాద్‌లో చక్రం తిప్పి పది రోజుల క్రితం ఏసీపీ కిరణ్‌కుమార్ స్థానంలో విజయ సారథిని తీసుకువచ్చారు. ఉన్నట్టుండి కిరణ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేయడంతో బోధన్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆయన స్థానంలో వచ్చిన విజయసారథి బోధన్ ఏసీపీగా వెంటనే బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా మూడ్రోజుల క్రితం కిరణ్‌కుమార్‌కు నిజామాబాద్ సీసీఎస్‌లో ఏసీపీగా ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన విధుల్లో చేరకుండా మళ్లీ బోధన్ ఏసీపీగా వచ్చారు. కాగా జిల్లాలో ఎస్సై, సీఐ, ఏసీపీల బదిలీల్లో ఖద్దరు నేతల సిఫార్సు ప్రకారం స్థానాల కేటాయింపు ఉంటుందని పోలీసు వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఖద్దరు నేతకు అనుకూలంగా లేని పోలీసుల బదిలీలు ఆ అధికారికి తెలియకుండానే జరిగిపోయిన ఘటనలు జిల్లాలో ఉన్నాయి. ఇందుకు బోధన్ ఏసీపీ బదిలీలే తాజా ఉదాహరణగా చెప్పవచ్చు.

చాలెంజ్‌గా తీసుకున్న ప్రజాప్రతినిధి

తనకు తెలియకుండానే బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ బదిలీ జరగడంపై నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి చాలెంజ్‌గా తీసుకున్నట్లు సమాచారం. వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లిన ఏసీపీ కిరణ్‌కుమార్‌కు డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన షాక్‌కు గురైనట్లు తెలిసింది. కిరణ్‌కుమార్ సెలవుల నుంచి రాకముందే ఆయన స్థానంలో విజయసారథి బాధ్యతలు స్వీకరించారు. ఈ పరిణామాలపై స్థానిక నేతలు నియోజవకవర్గ స్థాయి ప్రజాప్రతినిధికి సమాచారం అందించినట్లు తెలిసింది. నియోజకవర్గ బడానేత విజయ్ సారథి బదిలీ ఉత్తర్వులు క్యాన్సిల్ చేయించి బోధన్ ఏసీపీగా మళ్లీ కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు ఇప్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేయించారు. కిరణ్‌కుమార్ ఏడాది క్రితం బోధన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య రగడతో ఏసీపీలు ఇబ్బందులు పడ్డారనే చర్చ జరిగింది.

మభ్యపెట్టి అధికారం చేపట్టిన కేసీఆర్



కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను ఆవిష్కరిస్తున్న నేతలు సుదర్శన్‌రెడ్డి, మధుయాష్కీ, మహేశ్‌గౌడ్

● మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



సునీల్‌కుమార్

కమ్మర్‌పల్లి: ప్రజలను మభ్యపెట్టి సీఎం కేసీఆర్ అధికారం చేపట్టారని మాజీ మంత్రి పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తన స్వార్థం కోసం పనులు చేపట్టారు గానీ ప్రజల సంక్షేమం కోసం ఎంత మాత్రం కాదన్నారు. గురువారం కమ్మర్‌పల్లిలోని లలితా గార్డెన్స్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముత్యాల సునీల్‌కుమార్ ఆహ్వాన సభ నిర్వ హించారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డితో పాటు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి పాల్గొన్నారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ ఆస్తులను అమ్మి, ప్రజలపై ట్యాక్స్‌ల భారం మోపుతున్నా డని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు కనీస గౌరవ మర్యాదలు లేవని, ప్రజాస్వామ్యం అంటే ఇదే నా అన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు విభేదాలను పక్కన పెట్టి పార్టీని అధికారంలోకి తీసుకురావాల న్నా రు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు, వృద్ధాప్య పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామన్నారు.

పార్టీ ఆదేశానుసారం పనిచేస్తా..

పార్టీ ఆదేశానుసారం పని చేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని ముత్యాల సునీల్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో వర్షాలకు రోడ్లు, చెక్‌డ్యామ్‌లు దెబ్బతినడంతో పాటు, పంట పొలాలు కొట్టుకుపోయాయన్నారు. పంట నష్టం పరిహారం అందించిన పాపాన పోలేదని విమర్శించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అవినీతిపై పోరాటం చేసి, బాల్కొండ నియోజకవర్గ ప్రజలను కాపాడుకుంటానని ఆయన అన్నారు. కాంగ్రెస్ రుణమాఫీ ప్రకటనతో సీఎం కేసీఆర్ రుణమాఫీ ప్రక్రియ షురూ చేశారని, ఇది రేవంత్‌రెడ్డి విజయంగా అభివర్ణించారు.

కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల ఆవిష్కరణ

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే రూ.రెండు లక్షల రుణమాఫీ పేరుతో సునీల్‌రెడ్డి ముద్రించిన కార్డులను నాయకులు ఆవిష్కరించారు.

ప్రశాంత్‌రెడ్డిని నిద్రపోనివ్వరు

కాంగ్రెస్‌లో చేరిన ముత్యాల సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కలిస్తే మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని నిద్రపోనివ్వరని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అన్నారు. గంజాయి దందాకు కేరాఫ్ ప్రశాంత్‌రెడ్డి అని, లిక్కర్‌కు ఎమ్మెల్సీ కవిత కేరాఫ్‌గా నిలిచారని ఎద్దేవా చేశారు. బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఖాతాలోకి వస్తుందని సర్వేలో తేలిందన్నారు. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు పేరుతో ప్రజలను మోసం చేసి ముఖం చాటేశారని విమర్శించారు.

పిల్లలతో పని చేయిస్తే కేసులు

● జిల్లాలో 50 మంది బాలబాలికల గుర్తింపు
● తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
● ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ – 9లో 50 మంది బాలబాలికలను గుర్తించినట్లు ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్–9 నిర్వహించినట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలలో తప్పిపోయిన, వదిలివేయబడిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం సేకరించి, వారితో పనిచేయించే యాజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. బాలబాలికల తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ చేసి అప్పగిస్తామని, తల్లి దండ్రులు లేని వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) వారికి అప్పగిస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో 50 మంది పిల్లలను పట్టుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ డివిజన్‌లోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పన్ యాప్‌లో నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ ఆపరేషన్ ముస్కాన్‌లో నిజామాబాద్–19, ఆర్మూర్ –14 బోధన్– 17 గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. జిల్లాలో తప్పిపోయిన, పనిచేస్తున్న, వదిలివేయబడిన బాలబాలికల సమాచారం తెలిసినట్లయితే డయల్ 100, సెల్ నెంబర్ 87126–59777, ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్టు సహాయ కోచ్‌గా ఉపేందర్

వేల్పూర్: వేల్పూర్‌కు చెందిన ఉపేందర్ తెలంగాణ బాలికల బాస్కెట్ బాల్ జట్టు సహాయ కోచ్‌గా ఎంపికయ్యారు.గురువారం నుంచి పాండిచ్చేరిలో ప్రారంభమైన అండ ర్ 14 బాలికల బాస్కెట్‌బాల్ జట్టుకు సహాయ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈనెల 10 వరకు పోటీలు జరుగనున్నాయి. ఉపేందర్ తెలంగాణ బాలికల బాస్కెట్‌బాల్ జట్టుకు సహాయ కోచ్‌గా ఎంపిక కావడంపై వేల్పూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



యూసీసీ ర్యాలీ భగ్నం

● బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు
● హైకోర్టు అనుమతి తీసుకుని మళ్లీ ర్యాలీ నిర్వహిస్తాం : నేతల వెల్లడి

బోధన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న యూసీసీ (యూనిఫాం సివిల్ కోడ్) బిల్లుకు మద్దతుగా గురువారం బోధన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా తలపెట్టిన ర్యాలీని పోలీసులు భగ్నం చేశారు. నియోజక వర్గం పరిధిలోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల నుంచి ర్యాలీ రాకుండా ఎక్కడిక్కడ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముందస్తు అరెస్టులు చేసి నాయకులను కట్టడి చేశారు. పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ఎన్డీఎస్ఎల్ క్రాసింగ్ నుంచి ర్యాలీని ప్రారంభించాలని నిర్ణయించిన మేరకు ఉదయం 10 గంటల సమయంలో పార్టీరాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, నాయకులు సుధాకర్ చారి, బాల్‌రాజ్, అడ్లూరి శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు.

ర్యాలీ ప్రారంభించేందుకు సన్నద్ధమవుతుండగా టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై నాయకులు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని టౌన్ సీఐ స్పష్టం చేశారు. ఈ క్రమంలో స్టేషన్ ప్రాంతంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. పట్టణ ప్రధాన కూడళ్లల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. నియోజక వర్గం పరిధిలో 91 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ నాయకుల నిరసన

అక్రమ అరెస్టులు సరికాదు..

ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా చేపట్టిన ర్యాలీకి ముందస్తుగా అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ర్యాలీకి స్వచ్ఛందంగా విద్యార్థులు, యువత, మేధావులు, వ్యాపారులు వందలాది మంది తరలి వచ్చారని పేర్కొన్నారు. ఆరు రోజుల క్రితం ఇచ్చిన దరఖాస్తుకు పోలీసులు సానుకూలంగా స్పందిస్తూనే రాత్రికి రాత్రే ర్యాలీకి అనుమతి లేదంటూ తేల్చి చెప్పారని, ఎవరి ఒత్తిళ్లలో ర్యాలీని అడ్డుకున్నారో పోలీసులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైకోర్టును ఆశ్రయించి మళ్లీ భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కులమతాలు, వర్గాలకతీతంగా ఒకే దేశం, ఒకే చట్టం ఉండే విధంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న యూసీసీ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. భావితరం భవిష్యత్తు, దేశ సమైక్యత కోసమేనని అన్నారు.

రేషన్ దుకాణాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం

● పోషకాహార లోపం నివారించేందుకు..
● 8వేల మెట్రిక్ టన్నులు అవసరం
● ఈనెల 10 నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు

సుభాష్‌నగర్: పోషకాహార లోపంతో పేదలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోషకాలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. 2024 నాటికి దేశంలోని అన్ని రేషన్ షాపుల ద్వారా ఈ బియ్యాన్ని అందించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈమేరకు ఆగస్టు నుంచే జిల్లా వ్యాప్తంగా రేషన్‌దుకాణాల ద్వారా బలవర్ధకమైన బియ్యాన్ని సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోషకాలతో కూడిన బియ్యాన్ని (ఫోర్టిఫైడ్) రేషన్‌షాపుల ద్వారా ఈనెల 10 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీలు, పాఠశాలలకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్నారు. ఆహారభద్రతా కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని 4,05,000 కార్డుదారులు, గురుకులాలకు కలిపి ప్రతినెలా 8వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.



ఫోర్టిఫైడ్ బియ్యం

ఫోర్టిఫైడ్ అంటే..

ఐరన్, విటమిన్ డి, బి–12తోపాటు మరిన్ని పోషకాలు లభించేలా గోధుమలు, మినుములు, పెసర, అపరాలు, రాగులు, సజ్జలు వంటి తృణధాన్యాలను పొడిగా మార్చి, వాటిని బియ్యం పరిమాణంలో గింజలుగా చేస్తారు. సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని మర ఆడించే సమయంలో సార్టెక్స్ చేస్తారు. అంటే నాసిరకం గింజలు తొలగించి, మేలురకం బియ్యం మాత్రమే వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత ఫోర్టిఫైడ్ బ్లెండింగ్ చేస్తారు. ఒక క్వింటాలుకు సాధారణ బియ్యంలో తృణధాన్యాలతో చేసిన కిలో ఫోర్టిఫైడ్ గింజలను మిషన్ ద్వారానే (బ్లెండింగ్) కలుపుతారు. అవి పూర్తిస్థాయిలో బియ్యంతో కలిసిపోయేలా మిక్స్ చేస్తారు.

పోషకాలు కలిగిన గింజలను తయారు చేసి కేంద్రమే మిల్లులకు సరఫరా చేస్తోంది. దీంతో బియ్యంలో ఉండే పిండి పదార్థాలతోపాటు పోషకాలు మిళితం అవుతాయి. ఆ ఆహారం తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతోంది.

కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి



ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ ఈనెల నుంచి ప్రారంభిస్తాం. పోషకాలతో కూడిన బలవర్ధకమైన బియ్యంతో కార్డుదారులకు ప్రయోజనం చేకూరుతోంది. పేదల్లో పోషకాహార లోపం నివారించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బియ్యాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి.
– చంద్రప్రకాశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఘనంగా తీజ్ వేడుకలు

ధర్పల్లి: డీబీ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చింతల్ తండా, సీతాయిపేట్ పంచాయతీ పరిధిలోని భగవాన్ నాయక్ తండాలో గురువారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. చింతల్ తాండ తీజ్ వేడుకల్లో జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మండల బీఆర్ఎస్ నాయకులు, భగవాన్ నాయక్ తండాలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పాల్గొన్నారు. ఆయా తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువతులు వెదురు బుట్టలో పెరిగిన గోధుమ మొలకలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.



చింతల్ తండాలో తీజ్ వేడుకల్లో జగన్

ఎట్టకేలకు రుణమాఫీ..

● జిల్లాలో పంట రుణ మాఫీ లక్ష్యం రూ.1,790 కోట్లు
● మొత్తం 2,91,188 మంది రైతులకు ప్రయోజనం

మోర్తాడ్(బాల్కొండ): పంట రుణాల మాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 2018 ముందస్తు ఎన్నికల్లో భాగంగా తాము మరోసారి అధికారంలోకి వస్తే ఏక కాలంలో రూ.లక్ష వరకు పంట రుణం మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ అప్పట్లో ప్రకటించారు. ఆచరణలో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడింది. మొదటి విడతలో రూ.25 వేల వరకు, రెండో విడతలో రూ.50 వేల వరకు మాత్రమే రుణ మాఫీ కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ప్రతి బడ్జెట్‌లో రుణ మాఫీ కోసం నిధులను కేటాయించినట్లు పేర్కొన్నా.. ఆర్థిక శాఖకు ఆదేశాలు అందకపోవడంతో రుణ మాఫీ పెండింగ్‌లో పడింది. ఈ సంవత్సరం చివరికల్లా రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో రుణ మాఫీపై ప్రభుత్వం స్పందించిందనే వాదన వినిపిస్తుంది. గురువారం నుంచి సెప్టెంబర్ రెండోవారం వరకు రైతుల ఖాతాల్లో రుణం మాఫీ సొమ్ము జమ చేస్తామని సీఎం కె చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇదిలా ఉండగా రుణం మాఫీ వర్తించడానికి తాము అర్హులం అవుతామో కాదో అనే సందేహంతో అనేక మంది రైతులు బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేసుకోలేదు. ఫలితంగా బ్యాంకుల దృష్టిలో ఎగవేతదారులుగా గుర్తించబడ్డారు. పంట రుణం మాఫీపై ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనలో బ్యాంకులకు బకాయిలు సకాలంలో చెల్లించినవారికే రుణ మాఫీ సొమ్ము జమ చేస్తారని స్పష్టంగా ఉంది. అంటే బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేసుకోని రైతులకు రుణ మాఫీ వర్తించే అవకాశం లేదని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అలాగే పంట రుణం మాఫీకి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేస్తేనే అర్హులు ఎవరు ఎంత మంది అనేది వెల్లడవుతుంది. జిల్లాలో 2,91,188 మంది రైతులకు రూ.లక్ష వరకు పంట రుణం మాఫీ కావాల్సి ఉందని వ్యవసాయ శాఖ గతంలో గుర్తించింది. వీరికి కాకుండా ఇప్పటి వరకు రెండు విడతల్లో 45,812 మందికి రుణం రూ.50 వేల లోపు మాఫీ జరిగింది.



జిల్లాలో రుణ మాఫీ లక్ష్యం రూ.1,790 కోట్లు అని వ్యవసాయ శాఖ గతంలోనే నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఏది ఏమైనా పంట రుణం మాఫీకి ప్రభుత్వం స్పందించడంతో కొంత ఆలస్యమైనా రైతుల ఖాతాల్లో రైతుబంధు సొమ్ము జమ చేసినట్లుగానే రుణ మాఫీ సొమ్ము కూడా జమ కానుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కబ్జాకు గురైన భూమి స్వాధీనం



లింగంపేట: మండలంలోని కొండాపూర్‌లో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కొట్టాలు వేసుకోవడంతో కలెక్టర్‌ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ, పోలీస్‌ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్‌ 8లో కమ్మరి రాములుతో పాటు మరికొంత మందిని 27 గుంటల భూమిని కబ్జా చేసుకొని పశువుల కొట్టాలు వేసుకున్నారు. గ్రామ పంచాయతీ భూమిని కబ్జా చేసినట్లు సర్పంచ్‌ కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి సదరు భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌ రాజేశ్వర్‌, ఎస్సై ప్రభాకర్‌, ఆర్‌ఐ బాలయ్య, సర్పంచ్‌ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల రక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. నందివాడ శివారులో మొక్కజొన్న, పత్తి, సోయా పంటలను ఆమె గురువారం పరిశీలించారు. పంటల్లో అధిక నీటిని తొలగించాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి పంటలో ఎకరానికి 20 కిలోల యూరియాను లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. సోయాబీన్‌ పంటలో తెగులు నివారణకు ఎకరానికి 300 గ్రాముల అసిఫేట్‌ లేదా 400 గ్రాముల అసితామప్రిడ్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్‌, ఏఈవో రాకేష్‌, రైతులు పాల్గొన్నారు.

వైన్‌ షాప్‌లో దొంగతనం

బీబీపేట: బీబీపేటలోని మద్యం దుకాణంలో గురువారం తెల్లవారుజామున దొంగలు మద్యం బాటిళ్లు, నగదును ఎత్తుకెళ్లారు. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. కామారెడ్డికి చెందిన పైడి రాజేశ్వర్‌రెడ్డి మండల కేంద్రంలో మద్యం దుకాణం నడుపుతున్నాడు. తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు రూ. 21,600 విలువైన మద్యం బాటిళ్లు, రూ.5,500 నగదును ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా తుజాల్‌పూర్‌లో గల మద్యం దుకాణంలో చోరీకి విఫలయత్నం చేశారు. రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తేనె తీస్తూ జీవనం!

- తేనెటీగలు కుడుతున్నా వెరవకుండా..
- సేకరించి విక్రయిస్తున్న యువకులు

బాల్కొండ: రాజస్థాన్‌ నుంచి వలస వచ్చిన కొందరు యువకులు తేనె సేకరించి రోడ్డు పక్కన విక్రయించుకుంటు జీవనోపాధి పొందుతున్నారు. మధురమైన తేనెను వెలికి తీస్తున్న తమ బతుకుల్లో మాత్రం చీకటే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన యువకులు చెట్లపై, ఇంటి ఆవరణలో, ఇళ్లపై పెట్టిన తేనె తుట్టెను తొలగించి తేనె సేకరిస్తారు. ఈ క్రమంలో తేనెటీగలు కుట్టిన ఓర్చుకుంటూ బతుకు దెరువు కోసం ఆ పనినే ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. మెండోరా మండలం పోచంపాడ్‌ కాలనీలో ఎక్కువగా చెట్లపై తేనెటీగలు పెద్ద పెద్ద తుట్టెలను పెట్టాయి. తేనెటీగలు లేస్తే కుడతాయని భయంతో స్థానికులు రాజస్థాన్‌కు చెందిన యువకులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి తుట్టెలను తొలగించి, తేనె సేకరించారు. రోజుకు 10 నుంచి 15 తేనె తుట్టెల నుంచి తేనె వెలికి తీస్తామని యువకులు అంటున్నారు. సేకరించిన తేనెను అధికంగా పట్టణాల్లో రోడ్ల పక్కన విక్రయిస్తామన్నారు. స్వచ్ఛమైన తేనె కావడంతో కొనుగోళ్లు బాగానే ఉంటాయని చెబుతున్నారు. పోచంపాడ్‌ రోడ్డు వద్ద కిలో రూ.400కు విక్రయించారు.



పోచంపాడ్‌లో చెట్టుపై నుంచి తేనె తీస్తున్న యువకుడు

ఎంత పెద్ద చెట్టు అయిన వెంటనే ఎక్కి కొద్దిపాటి మంట పెట్టి వెంటనే తేనెటీగలను రాల కొడతారు. ఆ సమయంలో తల చుట్టురుగా తేనెటీగలు ముసురుకుని కుడుతుంటాయి. ఆ బాధను భరించడం అంత సులువు కాదంటున్నారు. తేనెటీగలు ముళ్లు కూడ అధికంగా గుచ్చుకుంటుంది. అయిన బతుకు పోరులో ఇవ్వన్ని భరిస్తున్నారు.



రోడ్డు పక్కన తేనె విక్రయిస్తున్న యువకులు

ఇదే జీవనోపాధి

రాజస్థాన్‌ నుంచి వలస వచ్చి హైదరాబాద్‌లో స్థిర పడ్డాం. తేనె సేకరించి అమ్మడం జీవనోపాధిగా మార్చుకున్నాం. ఎక్కడన్న చెట్లపై తేనె తుట్టెలు ఉంటే అక్కడి వారి అనుమతితో తేనే సేకరించి జీవనం సాగిస్తున్నాం. – రాజు

ఇబ్బందిగా ఉంటుంది

తేనెటీగలను లేపినప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. అవి కుడుతుంటాయి. అయిన భరిస్తు తేనెను తీస్తుంటాం. తీసిన తేనెనే పట్టణాల్లో రోడ్డు పక్కన అమ్ముకుంటాం. అలా వచ్చిన సొమ్ముతో బతుకుతున్నాం. – మిథున్‌

నట్టల నివారణ మందు వేయించాలి

రుద్రూర్: పశువులకు నట్టల నివారణ మందు వేయించాలని జిల్లా పశు సంవర్థక శాఖాధికారి జగన్నాథచారి సూచించారు. కోటగిరి మండలం ఏక్లాస్‌పూర్‌లో గురువారం పశువులకు ఉచిత నట్టల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జీవాల పెంపకందారులు నట్టల నివారణ, గాలికుంటు వ్యాధినిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌ గంగాధర్‌, జెడ్పీటీసీ శంకర్‌ పటేల్‌, వెటర్నరీ ఏడీ బాలిక్‌ అహ్మద్‌, బస్వారెడ్డి, మండల పశువైద్యాధికారి సురేష్‌ కుమార్‌ పాల్గొన్నారు.



నట్టల మందు వేస్తున్న అధికారులు

నాణ్యమైన విద్య అందించాలి



డిచ్‌పల్లి: తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా జరిగేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించి, నాణ్యతతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ అన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌ సామర్థ్యాల సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భాషోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌ శ్రీనివాస్‌రెడ్డి, సంధ్యారాణి శిక్షణ తరగతులపై సూచనలు ఇచ్చారు.

పేపర్‌ ఏజెంట్లను ఏకతాటిపైకి తీసుకొస్తాం



బాన్సువాడలో మాట్లాడుతున్న పేపర్‌ ఏజెంట్లు

బాన్సువాడ: కామారెడ్డి జిల్లాలో పని చేస్తున్న న్యూస్‌ పేపర్ల ఏజెంట్లను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ప్రింట్‌ మీడియా డిస్ట్రిబ్యూటర్స్‌ అసోషియేషన్‌ నిజామాబాద్‌ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుకారం, జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం అన్నారు. గురువారం బాన్సువాడలో కామారెడ్డి జిల్లా పేపర్‌ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. నిజామాబాద్‌ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్‌, సభ్యులు శ్రీకాంత్‌, రవికుమార్‌, ఎంజే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కరణ్‌రెడ్డి

సుభాష్‌నగర్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా చెన్న కరణ్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య గురువారం నియమించారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్‌, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర, జిల్లా నాయకులకు కరణ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

స్కూలుకు పోయే దారే ఇది!

- అధ్వానంగా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం అధ్వానంగా మారింది. పట్టణంలో నడిఒడ్డున ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లే దారులు కూడా ఇంత అధ్వానంగా ఉండవంటే నమ్మండి. కనీసం ప్రార్థన చేసేందుకు కూడా స్థలం సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే ప్రార్థనలు చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణ దుస్థితిపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

నాగిరెడ్డిపేట: బొల్లారంలో పోలింగ్‌ కేంద్రాలను గురువారం ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్‌ రమేశ్‌ పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాలలో గల వసతులను స్థానిక తహసీల్దార్‌ సయ్యద్‌ అహ్మద్‌ మస్రూర్‌ను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పోలింగ్‌ కేంద్రాల పరిధి లో ఓటర్ల సంఖ్య, ఇతర వివరాలపై ఆయన ఆ రా తీశారు. కార్యదర్శి సంతోష్‌, పాఠశాల హెచ్‌ఎం శివ కుమార్‌ పాల్గొన్నారు.



కాంట్రాక్టు అధ్యాపకులపై వివక్ష తగదు

భిక్కనూరు: యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులపై వివక్ష తగదని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్‌ నారాయణ గుప్తా అన్నారు. గురువారం సౌత్‌ క్యాంపస్‌లో మాట్లాడుతూ.. 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్‌ చేసి గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్‌ నిలబెట్టుకోవాలన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్‌ యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, సరిత, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణగుప్తా

మైనారిటీ గురుకుల పాఠశాల తనిఖీ

బాన్సువాడ రూరల్: మండలంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఆర్‌ఎల్‌సీ బషీర్‌, విజిలెన్స్‌ అధికారులు అహ్మద్‌ జియా, హమీద్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బియ్యం, వంట సరుకులు పరిశీలించి పలు సూచనలు చేశారు.



బియ్యం పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

క్రైం కార్నర్

రెచ్చిపోయిన దొంగలు

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల చోరీలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ పంచాయతీ పరిధిలోని ఇస్లాంపురా కాలనీలో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై మహేష్‌, బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాసెట్టి సింహాద్రి తన భార్య, కొడుకుతో కలిసి ఇస్లాంపురాలో నివసిస్తున్నాడు. పది నెలల క్రితం సింహాద్రి బతుకుదెరువు కోసం గల్ఫ్‌ వెళ్లాడు. అతడి భార్య నందిని, కొడుకు (పిల్లాడు) మాత్రమే ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆమె ఇంటికి తాళం వేసి ఓనర్‌ వాళ్ల ఇంట్లో నిద్రించింది. గురువారం ఉదయం లేచి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న మూడున్నర తులాల బంగారం, రూ.20వేలు నగదులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిందది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందల్వాయి కిరాణ దుకాణంలో..

ఇందల్వాయి: ఇందల్వాయిలోని ఓ కిరాణా దుకాణంలో గురువారం వేకువజామున దొంగతనం జరిగింది. గుణపంతో షట్టర్‌ తాళాలు ధ్వంసం చేసి షాపులోకి చొరబడ్డ దుండగుడు కౌంటర్లో ఉంచిన సుమారు రూ.6000 ఎత్తుకెళ్లాడు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో నమోదయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు.



చిక్లిలో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కొండూర్‌ శివాలయంలో..

సిరికొండ: మండలంలోని కొండూర్‌లో గల శివాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో గల హుండీని ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్సై రమేశ్‌ పరిశీలించారు.

కిరాణ దుకాణంలో..

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల మున్నూరు విజయకు చెందిన కిరాణ దుకాణంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు దుకాణం ముందు ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దుకాణంలోకి చొరబడి సిగరెట్‌ డబ్బాలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిక్లిలో ఆరు తులాల బంగారం..

మాక్లూర్: మండలంలోని చిక్లిలో బుధవారం రాత్రి ద్యాగ నీలకంఠం ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు.. నీలకంఠం బుధవారం ఉదయం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌ వెళ్లాడు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష 25 వేల నగదు, 30 తులాల వెండి ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన ఇంటిని ఎస్సై సుధీర్‌రావు పరిశీలించారు. క్లూస్‌ టీంను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

19.65 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్‌ బియ్యం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని నల్లకుంట మైసమ్మ ప్రాంతంలో ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 బస్తాల పీడీఎస్‌ బియ్యాన్ని గురువారం టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు, సివిల్‌ సప్లయ్‌ అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి బియ్యాన్ని సీజ్‌ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ తహసీల్దార్‌ కిష్టయ్య తెలిపారు. బ్రాహ్మణపల్లి వెంకటరమణ, లింగంపేటకు చెందిన చింతల లక్ష్మీనారాయణ, వీరికి సహకరించిన భవానీపేట తండాకు చెందిన అజ్మీర్‌ రాము అలియాస్‌ సక్రియా, ఆర్‌బీనగర్‌కు చెందిన ఇబూది గణేష్‌, ఇందిరానగర్‌కు చెందిన షేక్‌ అక్బర్‌, భవానీపేట తండాకు చెందిన బానావత్‌ రవీందర్‌ 19.65 క్వింటాళ్ల బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని జంగంపల్లి ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌కు తరలించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఘటన స్థలానికి దేవునిపల్లి ఎస్సై రాజు సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. దీంతో ఆందోళనకు గురైన పీడీఎస్‌ బియ్యం వ్యాపారులు తమ దుకాణాలు మూసి పరారయ్యారు.

దొంగిలించిన బియ్యం పట్టివేత

నవీపేట: రైస్‌మిల్లులో దొంగిలించిన బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా నవీపేటలో పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. నిజామాబాద్‌ మండలం పాల్దా శివారులోని రైస్‌మిల్లులో బియ్యం బస్తాలను దొంగిలించారని యజమాని విశ్వనాథ్‌ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెంజల్‌ క్రాసింగ్‌వద్ద వాహనాలను తనిఖీ చేయగా బియ్యం బస్తాలతో వెళ్తున్న ఆటోను పట్టుకున్నామన్నారు. ఆటోలో 10 బియ్యం బస్తాలను కనిపించడంతో అందులోని వ్యక్తులకు విచారించామన్నారు. రైస్‌మిల్లులో దొంగించినట్లు చెప్పడంతో ఆటోను సీజ్‌ చేసి, అందులో ఉన్న నిజామాబాద్‌కు చెందిన సయ్యద్‌ అమీర్‌, షేక్‌గౌస్‌, అమీర్‌ఖాన్‌, అస్లామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ 44వ నంబర్‌ జాతీయ రహదారి బైపాస్‌ సమీపంలోని డపింగ్‌యార్డు వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని ఒంటిపై బ్లూకలర్‌ టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయని ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

భిక్కనూరు: భిక్కనూరు కొత్త చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. గ్రామానికి చెందిన జొర్రీగల బాల్‌నర్సయ్య (78) గురువారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకోదానికి వెళ్లి ప్రమాదశాత్తు చెరువులో పడి చనిపోయాడు.

విద్యుత్‌ షాక్‌తో ఆవు..

గాంధారి: మండలంలోని చద్మల్‌ తండాలో ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద గురువారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. తండాకు చెందిన రైతు మంజ గోపాల్‌ ఆవు మేతకు వెళ్లి షాక్‌తో మృతి చెందింది.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి రిమాండ్‌

మాక్లూర్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.6 కోట్లకు టోకరా వేసిన మండలంలోని కొత్తపల్లికి చెందిన కడియాల రామకృష్ణను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. గాంధారి మండలం తిమ్మాపూర్‌కు చెందిన రమేష్‌ ఫిర్యాదు మేరకు రామకృష్ణపై కేసు అయిందన్నారు. నిందితుడిని పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు చందు, శ్రీను, వెంకటస్వామిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌ శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీసిద్ధరామేశ్వరనగర్‌కు చెందిన అరిగే సత్తయ్య, తన కుమారుడు దశరథ్‌తో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై రామాయంపేటకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెదక్‌ జిల్లా రామాయంపేట ఆస్పత్రికి తరలించారు.

ఇంటి స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్‌ కాలనీకి చెందిన సత్యనారాయణకు తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. సత్యనారాయణకు 77 గజాల ఇంటి స్థలం ఉంది. దాని పక్కనే ఉన్న కమలామ్మ వారి కుటుంబసభ్యులు ఉన్నారు. ఈ ఇంటి స్థలంలో నాగవిగ్రహాలు పెట్టినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పాములబస్తీకి చెందిన గోక్‌ తాక్‌పై ఆదర్శనగర్‌కు చెందిన శుభమ్‌ దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. జూలై 30న తన చెంపపై కొట్టినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కడియంతో దాడి..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ ఠాణా పరిధిలోని ఆదర్శనగర్‌లోని శ్రీసాయి రెసిడెన్సీ వద్ద రిషబ్‌సింగ్‌పై బన్నిసింగ్‌ అనే వ్యక్తి దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. కడియంతో దాడి చేయడంతో కంటి వద్ద గాయాలైనట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివనగర్‌ మండలం వజ్జెపల్లి తండాకు చెందిన మాలోత్‌ రాజు డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి న్యాయమూర్తి ప్రతాప్‌ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడి ఆత్మహత్య



హరిబాబు (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మామిడి హరిబాబు (27) బుధవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తన చిన్నాన్న కుమారుడైన దుర్గ శైలంనకు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో పంపాడు. అందులో తన ఆత్మహత్యకు గ్రామానికి చెందిన మంద నవీన్‌, తన అత్త మెదక్‌ జిల్లా అక్కన్నపేటకు చెందిన పిట్ల లక్ష్మి, తన భార్య నవనీత కారణమని వీడియో పేర్కొన్నాడు. వీడియో చూసిన శైలం విషయాన్ని హరిబాబు కుటుంబీకులకు చెప్పాడు. వారు పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు..

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లిలో కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. గ్రామానికి చెందిన గొంద్రు చిన్న నారాయణ (65) రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

గ్రామంలో విషాదఛాయలు

భాగిర్తిపల్లిలో ఒకే రోజు ఇద్దరి అంత్యక్రియలు జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన హరిబాబు, నారాయణ అంత్యక్రియలు గురువారం సాయంత్రం గ్రామంలో నిర్వహించారు.